నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇతర అధికారులు

అంగన్వాడీలకు యాప్ కష్టాలు..!

• సమాచారం అప్‌లోడ్‌తో అవస్థలు • సమయం సరిపోక ఇబ్బందులు

అంగన్వాడీ కార్యకర్తలు యాప్‌లతో సతమతవుతున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి పోషకాలతో పాటు పిల్లలకు అందించే ప్రతి ఒక్కటీ ఆన్‌లైన్ యాప్స్ ద్వారా సమాచారాలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్‌లో తప్పక నమోదు చేయాల్సిందే. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సక్రమంగా అందక, అప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయలేక అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ యాప్‌లో భారం నుంచి తమకు విముక్తి కల్పించాలని, కార్యక్రమాల నమోదు ఆన్‌లైన్ కాకుండా ప్రత్యామ్నాయం చూడాలని వేడుకుంటున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గతంలో భారీ సమ్మె సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం పలు హామీలను కురిపించింది. గత వైసిపి ప్రభుత్వం హామి ఇచ్చినా ఒక్క హామీని కూడా అమలు చేసిన పాపాన పోలేదు. అంతేకాకుండా ఎన్నికల ప్రచార సమయంలోనూ కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు పలు హామీలను ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా నేటికీ వారికి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు యాప్‌ల భారం పెరిగింది. ఇప్పటికీ వారు క్షేత్రస్థాయిలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సెంటరు చిన్నారులు ఆలస్యంగా వస్తే వారికి అన్నం కూడా పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 16 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 3,486 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 3,326 మంది అంగన్వాడీ కార్యకర్తలు, 3,170 మంది ఆయాలు పని చేస్తున్నారు. గర్భవతులకు, బాలింతలకు, చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల నుంచి పకడ్బందీగా ప్రభుత్వం మెనూ అందించే ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి యాప్‌లలో అప్లోడ్ చేయాలి. కొంతమందికి మొబైల్ యాప్లో అప్లోడ్ కాక అవస్థలు పడుతున్నారు. ఈ యాప్‌ల నిర్వహణలో సక్రమంగా లేని, వివరాలు అప్‌లోడ్ కాని టీచర్లపై ఒత్తిడి చేస్తున్నట్లు అంగన్వాడీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా బాల సంజీవని కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. ఈ యాప్‌లో 7 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారుల తల్లుల ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ వివరాలు అప్‌లోడ్ అయితేనే పిల్లలకు ఇవ్వాల్సిన బాలామృతం, గుడ్లు, పాలు ఇవ్వాలి. గతంలో మాన్యువల్‌గా సంతకాలు చేయించుకుని వాటిని అందించే వారు. కొత్తగా తెచ్చిన ఈ యాప్‌తో అంగన్వాడీలపై మరింత భారం పడింది. గర్భిణులు, బాలింతలకు అందించే ఆహారం కూడా వారి ఫొటోలను అప్‌లోడ్ చేసి ఇవ్వాల్సి ఉంది. తరచూ సాంకేతిక లోపంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని అంగన్వాడీలు చెబుతున్నారు.

సమయం అంతా వాటికే..

పని దినాలలో ప్రతి ఒక్క అంగన్వాడీ కార్యకర్త ఉదయం 9 గంటలకు ఒకసారి మరల సాయం సాయంత్రం 4 గంటలకు ముఖంతో ఫోటో తీసి అప్లోడ్ చేయాలి. తదుపరి ప్రతి ఒక్క పిల్లల హాజరు ఫోటో తీసి అప్లోడ్ చేయాలి. ఈ విధంగా హాజరు చేసుకుంటూ ఉంటే యాప్లో అప్లోడ్ చేయడానికే సమయం సరిపోతుంది. ఇక పిల్లలకు పౌష్టికాహారం ఎప్పుడు అందించాలని ప్రశ్నిస్తున్నారు. అప్లోడ్ చేసిన తరువాత ఎవరైనా పిల్లలు లేటుగా వస్తే ఆహారాన్ని అందించే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా ఉందంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుకుంటున్నారు.

అంగన్వాడీలకు పని భారం తగ్గించాలి

అంగన్వాడీ టీచర్లకు పనిచేయని ట్యాబ్‌లు ఇచ్చి రకరకాల యాప్‌లలో ప్రభుత్వం ఆదేశించిన విధంగా అన్ని వివరాలు యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం నుండి ఒత్తిడి చేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అన్ని వివరాలు ఒకే యాప్‌లో ఉండే విధంగా ఏర్పాటు చేసి యాప్‌లను తగ్గించాలి. వీరికి వేసవి సెలవులు కూడా ఉండవు. కారణం గర్భవతులు ఉంటారు కాబట్టి వారికి కావాల్సిన న్యూట్రిషన్ పోషకాహారం ఇవ్వాల్సి ఉంటుంది. వేసవిలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకే అంగన్వాడీ సెంటర్లు పనిచేయాలని ఆదేశించారు. అలాగే వేసవిలో ఆయాలు 15 రోజులు టీచర్లు 15 రోజులు పని చేయాలని కూడా ప్రభుత్వం నుండి ఆదేశాలు ఇచ్చారు.

- ఎమ్‌డి.అంజిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

సమయం సరిపోవడం లేదు

ప్రస్తుతం ప్రభుత్వ ఇచ్చిన ట్యాబ్‌లో పోషణ ట్రాక్, బాల సంజీవని లాంటి యాప్‌లు ప్రస్తుతం చేస్తున్నాం. ఇందులో బరువులు ,ఆధార్, ఫోటో, పోషకాహారంలను ఎప్పటికప్పుడు చేస్తూ మొబైల్‌లో ఓటిపి తీసుకొని నమోదు చేయాల్సి ఉంటుంది. పోషణ పక్వాడ ప్రోగ్రాం, బేటి పడావో బేటి బచావో ఫోటోలు అప్లోడ్ చేయడం లాంటివి చేయాలి. ఈ నెల ఎనిమిదో తేదీ నుండి 22వ తేదీ వరకు చేయాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయి. ఒక్కోసారి నెట్ పనిచేయదు. పల్లెల్లో జనాలు ఇవి చేయటానికి రమ్మంటే రారు. ఇవన్నీ నమోదు చేయడానికి ఒక గంట సేపు టైం పడుతుంది. మాకు ఇంటి దగ్గర పనులు ఉన్నాయి ఇంతసేపు ఉండాలంటే మాతో కాదు అని ప్రజలు వెళ్ళిపోతూ ఉంటారు. ఫోటోలు కూడా అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. సమయం తగ్గించి ఒకే యాప్ లో అన్ని నమోదయ్యే విధంగా చేసి పని భారం తగ్గించాలి. వీటితోపాటు సెక్టార్ మీటింగ్‌లు కూడా ఉంటాయి. జీతం తక్కువ పని ఎక్కువ అనే విధంగా ఉంది. అన్ని త్వరగా నమోదు చేయాలని అధికారుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. దీనితో మానసిక క్షోభకు గురవుతున్నాం.

- రేణుకమ్మ, అంగన్వాడీ టీచర్.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- చేనేత అండ్ జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చేనేత కార్మికులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని చేనేత అండ్ జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో చేనేత కార్మికుల ఐడి కార్డులు, సొసైటీ ఏర్పాటు తదితర అంశాల పై సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ చేనేత కార్మికులు సొసైటీలుగా ఏర్పాటై ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.. సొసైటీలుగా ఏర్పడినప్పుడే ముద్ర రుణాలు, హెల్త్ ఇన్సూరెన్స్, యార్న్ సబ్సిడీ వంటి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 2 వేల 849 మంది చేనేత కార్మికులకు పెన్షన్‌లు ఇస్తున్నారని, కేవలం 3 సొసైటీ లు మాత్రమే యాక్టివ్ గా ఉన్నాయన్నారు. అర్హులైన చేనేత కార్మికులు అందరూ సొసైటీ లుగా ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ డిఆర్‌డిఎ,మెప్మా, చేనేత శాఖ అధికారులను ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి ప్రతిపాదనలు పంపినట్లయితే చేనేత ప్రక్రియలకు ఎన్ఆర్ఎల్ఎం (నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్) కింద నిధులు విడుదల చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలను 30 మందిని కలిపి ఒక క్లస్టర్ గా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఆర్‌డిఎ, మెప్మా పిడిలను ఆదేశించారు. ఇందుకు సంబంధించి గ్రూపు సభ్యులతో సమావేశాన్ని నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో ఉండే చేనేత మహిళలకు పంపిణీ చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ...ఎమ్మిగనూరులో 3 వేల నుండి 4 వేల వరకు చేనేత కార్మికులు ఉన్నారని, వారికి ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు. ఎమ్మిగనూరు ఎంఎస్ ఎమ్ఇ పార్కు లో ముందుగా 25 ఎకరాల్లో మౌలిక వసతులు, ఎకో సిస్టమ్, ఎఫ్లుయెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మిగనూరు చీరలకు విశిష్టత ఉందని, ఎమ్మిగనూరు బ్రాండ్‌కు ప్రత్యేకత తీసుకువచ్చి చేనేత కార్మికులను ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. జెసి డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, హ్యాండ్లూమ్ ఏడి నాగరాజారావు, ఎమ్మిగనూరు చేనేత కార్మికులు, మెప్మా పిడి నాగ శివలీల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రేఖా రాణి

అల్లూరి ఒక పోరాట స్ఫూర్తి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

అల్లూరి సీతారామరాజు ఒక పోరాట స్ఫూర్తిఅని, ఆయన ధైర్య సాహసాలు యువతకు ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కొనియాడారు. బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పూలమాలవేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... .. అల్లూరి సీతారామరాజు ను ఆదర్శంగా తీసుకొని దేశ, సమాజ సేవలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశ యువత ముందుకు సాగాలని కలెక్టర్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, సిపిఒ హిమప్రభాకర్ రాజు, కలెక్టరేట్ ఎఒ విజయశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా టూరిజం అధికారి విజయ, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైమ్: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి కర్నూలు ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ మోహన్ పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందన్నారు. పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడని ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో : కర్నూల్ నగరంలోని స్థానిక బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం నాడు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్ర పటానికి ప్రిన్సిపల్, లెక్చరర్స్, అడ్వకేట్ శ్రీధర్ , తైక్వాండో కోచ్ సతీష్ పూల మాల వేసి నివాళులర్పించారు. కళాశాల లెక్చరర్స్ రామకృష్ణ, విజయశేఖర్ , మల్లికార్జున, కృష్ణ మోహన్, సోమేష్, ఉల్గోజిరావు , నాన్ టీచింగ్ సిబ్బంది సత్యానందం, భాస్కర్ పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ఒకే జిల్లా, ఒకే పేపర్ పెట్టాలి

- పరీక్షకు సమయం 90 రోజులు ఇవ్వాలి

- సమస్యలు పరిష్కరించకుంటే 8న చలో విజయవాడ

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కర్నూలు బిర్లా కాంపౌండ్‌లో రోడ్డుపైన బహిరంగంగా అధ్యయనం చేస్తూ డిఎస్‌సి అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ మాట్లాడుతూ అనేక ఉద్యమాలు పోరాట ఫలితంగా సాధించుకున్న డిఎస్‌సి అభ్యర్థులందరూ న్యాయబద్ధంగా ఉపయోగించుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఒక జిల్లాకు ఒకే పేపర్, డిఎస్‌సి అభ్యర్థుల ప్రిపరేషన్ కు 90 రోజులు గడువు ఇవ్వాలని, వయోపరిమితి 47సం లకు పెంచాలని, ఇంటర్, డిగ్రీ మార్కులు 40 శాతం తగ్గించాలని, ఓపెన్ విద్య చదివిన వారికి అవకాశం ఇవ్వాలని, డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ చదివిన వారికి ఎస్ ఏ లో పీఎస్ అవకాశం ఇవ్వాలని, పిఇటి పోస్టులు పెంచాలని, టెక్నికల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత డిఎస్‌సి కోచింగ్ పూర్తయ్యే వరకు పరీక్షను పోస్టు ఫోన్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 2018లో ఆన్‌లైన్ డిఎస్‌సి వల్ల ఆఫ్‌లైన్ టెట్లో జిల్లా టాపర్ గా ఉన్న వాళ్ళు సైతం ఉద్యోగాలు కోల్పోయి కేవలం రెండు పేపర్లు రాసిన వారికి మాత్రమే ఉద్యోగాలన్నీ వచ్చాయని, దీనివల్ల తీవ్రమైన నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే డిఎస్‌సి రాసే ప్రతి అభ్యర్థికి నష్టం జరుగుతుందని తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8న జరిగే మంత్రివర్గ సమావేశంలో డిఎస్‌పి అభ్యర్థుల ఆవేదనను, బాధను తీవ్రమైన సమస్యలను చర్చించి న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్, సహాయ కార్యదర్శి హరికిషన్ రెడ్డి , నాయకులు విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్ భారీగా నిరుద్యోగులు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

స్మార్ట్‌మీటర్లు వద్దని పోస్టర్లు అతికిస్తున్న ఎం.రాజశేఖర్ తదితరులు

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలులో సిపిఎం ఆధ్వర్యంలో రెండవ వార్డు ఖల్లా వీధిలో సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకుడు నూర్ భాషా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇళ్లకు 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, తక్షణమే కరెంట్ చార్జీలు తగ్గించాలి' అనే స్టిక్కర్లను అతికించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి.షరీఫ్, శాఖ కార్యదర్శి, ఎస్‌డి.ఖాజా పాషా తదితరులు కలిసి, మాకు స్మార్ట్ మీటర్లను బిగించవద్దు.అనే స్టిక్కర్లను అతికించారు. ఎం.రాజశేఖర్ ,కార్యదర్శి వర్గ సభ్యులు ,ఎస్ ఎం డి షరీఫ్, నగర నాయకులు ఖాజా పాషా లు మాట్లాడారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదానీ నుండి లంచం తీసుకొని సెకి ఒప్పందం చేసుకున్నారని, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా దీనిని ప్రకటించారని గుర్తు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆ ఒప్పందాన్ని కొనసాగించడం సరికాదని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను దోచుకుందని, అందుకే ప్రజలు వారిని ఓడించారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు పెట్టబోమని వ్యతిరేకించిందని, అందుకే ప్రజలు కూటమికి అధికారం ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడం, ఛార్జీలు పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయకపోతే, విద్యుత్ ఛార్జీలు తగ్గిచకపోతే గతంలో టిడిపికి పట్టిన గతే పడుతుందని సిపిఎం నాయకులు హెచ్చరించారు.

సిబ్బంది సమన్వయంతో మెలగాలి

ప్రజాశక్తి-సి బెళగల్

ఈ ఖరీఫ్ సాగులు చేయుటలో రైతులకు అండగా రెవిన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది కలిసి మెలగాలని తహసీల్దార్ పురుషోత్తం, ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం రైతు సేవా కేంద్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని, ఈ ఖరీఫ్ లో ముందస్తు వర్షాలు ఉన్నాయని సలహాల మేరకు సాగులు మొదలు పెట్టాలని పేర్కొన్నారు. కౌలు దారులు భూ యజమాని దగ్గర నుండి కౌలు కార్డులు పొందాలని, అందుకే ఈ రైతు గ్రామ సభలు అని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొండా రెడ్డి బురుజు వద్ద మాక్ డ్రిల్

అత్యవసర పరిస్థితులపై అప్రమత్తతపై సూచన

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ నిర్వహణ కర్నూలు కొండారెడ్డి బురుజు దగ్గర చేపట్టారు. బుధవారం సాయంకాలం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచనల మేరకు 4 గంటలకు కర్నూలు కొండారెడ్డి బురుజు దగ్గర అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ ను అధికారులు నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ద్వారా జారీ చేసిన ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ప్రకారం మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్ చేసే ముందు ప్రజలు భయాందోళనలకు గురి కాకుండా ముందుగా వారికి సమాచారం అందించారు. ముందుగా కొండారెడ్డి బురుజు పరిసరాలు అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రజలకు వివరించి సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రదేశంలోకి వెళ్లే విధంగా సూచనలు ఇచ్చి చైతన్య పరిచారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రక్క దేశంతో ఉన్న ఉద్రిక్తల నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ప్రాణాలను కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆదేశాలు పాటించాలని సూచించారు. ఈ పరిస్థితులలో చేపట్టవలసిన చర్యలను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనుపమ, అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి పలు సూచనలు చేశారు. కర్నూలు పట్టణ 1, 2 సిఐ లు రామయ్య నాయుడు, రాజారావు , ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్‌లు ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బందోబస్తు చర్యలు చేపట్టారు. ఇంచార్జ్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ బాలరాజు, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, హాజరయిన అధికారులు

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మహిళలు స్వశక్తితో ఎదగాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత్ర రెడ్డి అన్నారు. బుధవారం ఓర్వకల్లు మండల కేంద్రం మహిళా సమాఖ్యలో పొదుపు ఐక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీషియన్ కోర్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తుందన్నారు. ఇప్పుడు బ్యూటిషన్ కోర్స్ నేర్చుకొని కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ విద్యాసాగర్, పొదుపు ఐక్య సంఘం గౌరవ అధ్యక్షులు విజయభారతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌరు చరిత రెడ్డి

గ్రీన్ సిటీలో గ్రిడ్ సమస్య

- వెలుగులు లేక వెలవెలబోతున్న జీవితాలు

-పట్టించుకోని అధికారులు-పాడవుతున్న గృహోపకరణాలు

-పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు సమీపంలోని శ్రీ వెంకటేశ్వర గ్రీన్ సిటీలో తక్కువ వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉంది. దీని వల్ల లైట్లు వెలగడం లేదు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు, టీవీలు పాడైపోతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు జన విజ్ఞాన వేదిక , పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులకు విన్నవించారు. వారి విజ్ఞప్తి మేరకు పిపిఎస్–ఎస్ ప్రతినిధి బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించింది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి. ఖాజా హుస్సేన్, కాలనీ ప్రతినిధులు ఎం. నారాయణ, సి. రాము, బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. యాకోబ్, పిపిఎస్ఎస్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు తెలిపారు. తక్కువ వోల్టేజ్ వల్ల నీటి సరఫరాకు మోటార్లు కూడా పనిచేయడం లేదని, రాత్రి వరకు విద్యుత్ కోసం ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టి పేరుతో పలు రకాల పన్నులు చెల్లిస్తున్నా ప్రజలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం న్యాయం కాదని పిపిఎస్ఎస్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి తెలిపారు. లో వోల్టేజ్ సమస్యను సంబంధిత విద్యుత్ అధికారుల దష్టికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా తొందర్లో విద్యుత్ లో వోల్టేజ్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మహమ్మద్ యూనూస్, ఎస్. అహమ్మద్, డాక్టర్ పి. హనీఫ్, బి. నాగేంద్ర, ఎస్. గౌస్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ అధికారులు త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రీన్‌సిటీలో సమస్యలు తెలుసుకుంటున్న పిపిఎస్ఎఫ్, జెవివి నాయకులు

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహణ

జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 12 నుండి 20వ తేది వరకు నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జాయింట్ కలెక్టర్ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను 76 సెంటర్లలో జరుగుతాయన్నారు. మొదటి సంవత్సరం నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 15501 మంది జనరల్ విద్యార్థులు, 791 మంది ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన విద్యార్థులు మొత్తం 16292 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు. 52 సెంటర్లలో పరీక్షలు వ్రాస్తున్నారన్నారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 4437 మంది జనరల్ విద్యార్థులు, 595 మంది ఒకేషనల్ కోర్సుకు సంబంధించిన విద్యార్థులు 5032 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. 24 సెంటర్లలో పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లను క్లోజ్ చేయించాలన్నారు. ఎపిఎస్ఆర్‌టిసి విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తగినన్ని బస్సులు ఆ రూట్లో తిరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్ఐఒ గురువయ్య శెట్టి, డివిఇఒ సురేష్ బాబు, జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి శాంతికల, ఎపిఎస్‌పిడిసిఎల్, లేబర్ డిపార్టుమెంట్, ఎపిఎస్ఆర్‌టిసి, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ

పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలుండాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉపాధిహామీ పథకం కింద పనిచేసే కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. కర్నూలు మండలం పంచలింగాల,తాండ్రపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. నారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాపితంగా ఉపాధి హామీ కూలీల వేతనాలు అందరికీ రాలేదన్నారు. పనిచేసిన వారంలోగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, సరఫరా చేయాలని, పనిచేసిన కూలీలకు ఎంత వేతనం వచ్చిందో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. పేస్లిప్‌లు ఇచ్చి, వారంలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం జిల్లా వ్యాపితంగా ఉద్యమం చేపడతామన్నారు. వేసవిలో తీవ్రమైన ఎండలు వున్నందున ఒఆర్ఎస్, మజ్జిగ సరఫరా చేయాలని వారు అన్నారు. పర్యటనలో ఈ తాండ్రపాడు సర్పంచి ఎస్.బాలపీరా, పంచలింగాల మాజీ సర్పంచి బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజల్లో అవగాహన కోసం మాక్ డ్రిల్

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తహశీల్దార్ ఎస్.రవి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. బుధవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ప్రజల క్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సూచనలు చేస్తే పాటించాలని, సైరెన్ మోగినప్పుడు అందరూ ఇళ్లలోకి వెళ్లి గ్యాస్ సిలిండర్, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆపేయాలని సూచించారు. మళ్లీ ప్రభుత్వం అప్రమత్తం చేసినప్పుడు ఆన్ చేసుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను, ప్రకటించిన ఆఫర్లను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి వాటికి స్పందిస్తే సైబర్ నేరం అవుతుందని చెప్పారు. పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక వాహనం, ప్రయివేట్ పాఠశాలల వాహనాలతో సైరెన్ మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. కోసిగి సిఐ మంజునాథ్, అగ్నిమాపక శాఖ ఎస్ఐ రామాంజినేయులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయ్ కుమార్, ఆర్ఐ ఆదాం, విఆర్ఒలు ఆనందం, నాగేష్, భీమయ్య, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్ల రామాంజి, లక్ష్మన్న, పరమేష్, రాముడు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటం

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

కార్మిక హక్కుల సాధన కోసం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ తెలిపారు. మేడే వారోత్సవాలు ముగింపు కార్యక్రమం మంగళవారం రాత్రి కల్లుబావి వీధిలో సుందరయ్య భవన్ వద్ద నిర్వహించారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు గోపాల్ అధ్యక్షత వహించారు. అంతకుముందు రాజు మాస్టర్ కళా బృందం ఎర్రజెండా గేయానికి చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాసే విధంగా లేబర్ కోడ్లను తీసుకురావడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రధాని మోడీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20న సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. నాయకులు లక్ష్మణ్, తిప్పన్న, ముక్కన్న, నాగరాజు, లక్ష్మణ్, వెంకటేష్, వీరేష్, మల్లికార్జున ఉన్నారు.

ఆదోని : వారోత్సవాల్లో మాట్లాడుతున్న రాధాకృష్ణ

సంస్కరణలకు వ్యతిరేకంగా ఉద్యమం

ఎమ్మిగనూరు : విద్యుత్ రంగంలో సంస్కరణలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు కోరారు. బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా సిఐటియు జెండాను ఆవిష్కరించారు. విద్యుత్ డిఇ కార్యాలయం ముందు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు రమేష్ అధ్యక్షతన సిఐటియు జెండాను అంజిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో కీలక రంగమైన విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్, టిడిపి, వైసిపి, బిజెపిలు ముక్కలుగా చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. లాభాల్లో ఉన్న ఈ రంగాన్ని అదానీ కంపెనీకి అప్పగించారని చేసుకొని యూనిట్ రేటు పెంచి ప్రజలపై కోట్లాది రూపాయల భారాలు మోపే పనులు చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ రంగాన్ని ప్రజలు, కార్మికులు కాపాడుకోవాలని కోరారు. ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు పి.గోవిందు, కార్యదర్శి బి.రాముడు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.కె.రన్ను, ప్రవీణ్, భీమేష్, జావీద్, పోతప్ప, పి.రాజు, ఎం.అబ్దుల్లా, యు.రమేష్, పోతప్ప, దేవేందర్ రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న అంజిబాబు

పకడ్బంధీగా రీ సర్వే చేపట్టాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - నందవరం

రీసర్వేను పకడ్బంధీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం నందవరం మండలం ముగతి గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టుగా రెండో విభాగంలో ఎంపికైన సందర్భంగా గ్రామంలో రీ సర్వేకు సంబంధించిన ప్రక్రియను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ముగతి గ్రామంలో జరుగుతున్న రీసర్వేపై, ప్రధాన సమస్యలు ఏమైనా ఉన్నాయా అని నందవరం తహశీల్దార్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ మహేష్, ముగతి విఆర్ఒ చక్రవర్తి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఘనంగా వాసవీ మాత జయంత్యుత్సవాలు

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో వాసవీ మాత జయంత్యుత్సవాలను మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. బుధవారం హోళగుందలోని పెద్ద బావి నుంచి ఊరేగింపుగా వెళ్లి వాసవీ దేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూలతో విగ్రహాన్ని అలంకరించారు. అనంతరం లలితా సహస్ర నామావళి పఠించి, కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర పారాయణం చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన ఆర్యవైశ్యులు వాసవీ కన్యకా పరమేశ్వరి చిత్రపటాన్ని, విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచి గ్రామపుర వీధుల గూండా భజనలతో, ఆటపాటలతో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు సింగంశెట్టి కృష్ణమూర్తి, శివప్ప, గోపాల్, సత్యం, పద్మనాభశెట్టి, జిటి.ప్రకాష్ శెట్టి, ప్రసాద్ శెట్టి, సింగం సుదర్శన్ శెట్టి, నవీన్ కుమార్ శెట్టి, శ్రీమంత్ శెట్టి, శ్రీధర్ శెట్టి పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

దేవరలో ఎమ్మెల్యే బీవీ పూజలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం కనకవీడు, నాగలదిన్నె గ్రామాల్లో బుధవారం జరిగిన దేవర ఉత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు.

పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

సర్వేలను సకాలంలో పూర్తి చేయాలి

- పూర్తి చేయని సచివాలయ అధికారులపై ఎంపిడిఒ అసంతృప్తి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేల (మిస్సింగ్ సిటిజన్స్, హౌస్ హోల్డ్ జియో కోఆర్డినేటర్లు, ఎన్‌పిసిఐ లింకప్, ఒటిఎఫ్, బాల ఆధార్)ను సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. చిప్పగిరి మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఎంపికైనందున ప్రతి సర్వే కూడా అనుకున్న ప్రకారం పూర్తి చేయాలన్నారు. కొంతమంది సచివాలయ అధికారులు అలసత్వం వహించడం మంచిది కాదని, ఇలాగే కొనసాగితే వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మురుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. లేని వారిని గుర్తించి వెంటనే నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి సర్వే కూడా సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని, అందరూ సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బాల ఆధార్‌ను పూర్తి చేయాలన్నారు. విధులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేసే బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, ప్రమీల, నరసింహులు, సుధీర్, సిసింద్రీ, నరేంద్ర, సురేంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

ఘనంగా దేవర ఉత్సవం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని శుక్రవారం పేటలో వెలసిన మారెమ్మ దేవర ఉత్సవం ఘనంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకు పూజ, బలి సమర్పణ చేశారు. ఉదయం బోనాల్లో నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే పార్థసారథి, భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గొరవయ్యల వేషధారణలో నిర్వాహకులు దుర్గప్ప, తిమ్మప్ప, నాగరాజు తదితరులు నృత్యం చేశారు. వారిని ఉత్సాహ పరిచేందుకు సిఐ శ్రీరామ్ వారితో జతకట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రశాంతంగా దేవర ఉత్సవం ముగియడంతో నిర్వాహకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

దర్శించుకుంటున్న గుడిసె ఆది కృష్ణమ్మ

గొరవయ్యలతో నృత్యం చేస్తున్న సిఐ

నాణ్యత లోపం...

- నేలకూలిన వాటర్ ట్యాంకు
- తప్పిన పెను ప్రమాదం
- రూ.9 కోట్ల ప్రజాధనం మట్టిపాలు
- 2017లో జిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారి ఆధ్వర్యంలో నిర్మాణం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో నిర్మించిన వాటర్ ట్యాంకు నాణ్యత లోపంతో నేలకూలినట్లు కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. బుధవారం ఉన్నట్టుండి వాటర్ ట్యాంకు నేలకూలడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. రోజూ ఈ వాటర్ ట్యాంకు వద్ద ఎండ తీవ్రతను తట్టుకోలేక కాలనీ పిల్లలు ట్యాంకు వద్ద సేద తీరేందుకు కూర్చునేవారు. ఈ సంఘటన జరిగినప్పుడు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడు వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీ వాసులకు తాగునీరు అందించేందుకు 2017వ సంవత్సరంలో నాబార్డు నిధులు రూ.9 కోట్లకు ప్రభుత్వం టెండర్లు పిలువగా 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణాన్ని హైదరాబాద్‌కు చెందిన జిపిఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు టెండర్ దక్కించుకున్నారని తెలిపారు. నిర్మాణం పూర్తయినా వాడుకలో లేని కారణంగా కూలిందని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా నీటి సరఫరాకు ట్రయల్ చేస్తున్న నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. నిర్మాణం పూర్తయినా పంచాయతీకి అప్పగించకుండా అలాగే వృథాగా వదిలేశారని సర్పంచి తెల్లబండ్ల భీమయ్య విమర్శించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నాణ్యతకు తిలోదకాలు ఇచ్చి నాసిరకంగా పనులు చేయడం వల్ల 8 ఏళ్లకే వాటర్ ట్యాంకు కూలి రూ.9 కోట్ల ప్రజాధనం వృథాగా తుంగభద్ర నదిలో కలిసినట్లు కాలనీ వాసులు మండిపడ్డారు.

ట్యాంకును పరిశీలించిన నాయకులు

కూలిన వాటర్ ట్యాంకును వైసిపి నాయకులు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరాముడుతో కలిసి పరిశీలించారు. వాటర్ ట్యాంక్ కూలిన విషయం తెలుసుకున్న టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైస్ ఎంపిపి పులికుక్క రాఘవేంద్ర, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్ శెట్టి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు మల్లికార్జున, వార్డు సభ్యులు వీరారెడ్డి సంఘటన స్థలానికి ఆరా తీశారు. ట్యాంకు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

ప్రారంభానికి నోచని ఉపాధి పనులు

- పొట్లపాడులో టిడిపిలోని ఇరుగ్రూపుల మధ్య విభేదాలు

ప్రజాశక్తి - దేవనకొండ

టిడిపిలోని ఇరు గ్రూపుల మధ్య విభేదాలు ఉండడంతో మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టాయి. మండలంలోని పొట్లపాడు గ్రామంలో టిడిపిలోని ఇరుగ్రూపుల విభేదాలతో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో సంబంధిత శాఖ అధికారులు విఫలమయ్యారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంలో కూడా తమ గ్రూపునకు కేటాయించాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ గ్రూపు, మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం శివప్రసాద్ గ్రూపునకు చెందిన నాయకులు పట్టుపట్టడంతో గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభానికి నోచుకోలేదు. రెండు రోజుల క్రితం ఆ గ్రామస్తులు ఉపాధి పనులు కల్పించాలని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

సమ్మెను జయప్రదం చేద్దాం : సిఐటియు

ప్రజాశక్తి - ఆదోని

దేశవ్యాప్తంగా ఈనెల 20న చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు అధికారులు సహకరించాలని సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిప్పన్న ఐఎఫ్‌టియు నాయకులు జి.వెంకప్ప, ఎఐటియుసి నాయకులు భీమేష్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్వాడీలు, ఆశావర్కర్లు సమ్మెలో పాల్గొంటారని, అనుమతి ఇవ్వాలని తెలిపారు. ఈనెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తూ ప్రదర్శన చేస్తామన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ కనీస వేతనం అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి గతంలో ఉన్న కార్మిక చట్టాలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల హక్కుల కోసం పోరాటం

- డివైఎఫ్ఐ మండల మాజీ కార్యదర్శి బాలకృష్ణ

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యార్థుల హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని డివైఎఫ్ఐ మండల మాజీ కార్యదర్శి బాలకృష్ణ కోరారు. బుధవారం మండలంలోని పుట్టకలమర్రి గ్రామంలో డివైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక వలస వెళ్తున్నారని తెలిపారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ద్వారా దేశంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఉద్యోగాల నోటిఫికేషన్లు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, కృష్ణ, నాయకులు మస్తాన్, సురేంద్ర, రామానాయుడు, వీరేష్, అరవింద్, రాజశేఖర్, శివ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం చిన్న మారయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండలు తీవ్రమయ్యాయని, మండలంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. మండలానికి తుంగభద్ర నది, ఎల్ఎల్‌సి ఉన్నా ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వల్లూరు గ్రామం సమీపంలో రూ.కోట్లతో నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఉన్నా గ్రామస్తులకు తాగునీరు అందడం లేదన్నారు. రాజా నగర్ క్యాంపు వద్ద ఎస్–ఎస్ ట్యాంకు ద్వారా కౌతాళం ప్రజలకు పది రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. ఒకే ఒక్క ఒహెచ్ఆర్ ట్యాంకు నిర్మించి 30 ఏళ్లవుతోందని చెప్పారు. ప్రస్తుతం మూడు రెట్లు పెరిగిందని, ఒక ట్యాంకుతో నీటి సరఫరా చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అదనంగా మరో రెండు ఒహెచ్ఆర్ ట్యాంకులు నిర్మించి, ఎస్ఎస్ ట్యాంకుకు 24 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులు చూడాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర నది నుంచి కొత్త పైపులైన్ ఏర్పాటు చేసి అదనంగా విద్యుత్ మోటార్లు అమర్చాలని తెలిపారు. కొన్నిచోట్ల రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయకుండా అలాగే వదిలేశారని, పొదలకుంట నుంచి హాల్వి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని చెప్పారు. ఆ రోడ్డు మొత్తం వేయాలని, మిగిలిపోయిన రోడ్లను వెంటనే బాగు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న, జె.వీరేష్, ఉరుకుంద వీరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు

- పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని పాత నల్ల గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ శివరాముడు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి, రైల్వే ఇంజినీర్ ఉమాపతితో కలిసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు రాకపోకలు సాగించేందుకు నల్ల గేటు అనుకూలంగా ఉండేదని తెలిపారు. గేటు ఎత్తివేయడంతో మార్కెట్ యార్డుకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే అండర్ ప్రాస్ బ్రిడ్జి ఏర్పాటుకు డిజైనింగ్ తయారు చేసి పనులు మొదలయ్యేలా చూస్తామని తెలిపారు. పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న ఫుట్‌పాత్ బ్రిడ్జి కూడా ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బ్రిడ్జి ప్రస్తుతం మూసుకుపోయిందని, అందులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి రాకపోకలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్, నాయకులు కిశోర్, సాయి ఉన్నారు.

పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిఐ

క్రీడలతో శారీరక దృఢత్వం : సిఐ శ్రీరామ్

ప్రజాశక్తి - ఆదోని

క్రీడల్లో పాల్గొనడం వల్ల ఏకాగ్రత పెంపొందిందని.. శారీరక దృఢత్వాన్ని పెంచుతుందని ఆదోని వన్ టౌన్ సిఐ శ్రీరామ్ తెలిపారు. ఫిలిప్ కబడ్డీ జట్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ శిక్షణ సమ్మర్ క్యాంపును బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు మైదానంలో సిఐ కబడ్డీ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సెల్, కంప్యూటర్, టివి చూడటం మానుకుని క్రీడలు నేర్చుకోవాలని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత ఉందన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని తెలిపారు. ఫిలిప్ కబడ్డీ టీం కోచ్ అమర్ ప్రకాష్ మాట్లాడారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు ఆదోని ఫిలిప్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ పట్ల ఆసక్తి పెంచుతూ ప్రతిభ కనబరిచిన వారితో టీము ఏర్పాటు చేసి టోర్నమెంట్‌లో పాల్గొనేలా చూస్తామన్నారు. ఆదోని ఫిలిప్స్ కబడ్డీ టీం ప్లేయర్స్ అరుణ్ జ్యోతి నగర్ దుబ్బా, నాగరాజు, ఎల్లప్ప, పరిశ, చిన్నా, సుమ, హారతి, శ్రుతి, వరలక్ష్మి, శ్రావణి, గోవిందు, రామాంజి, గోపి, సురేంద్ర, కిరణ్ కుమార్, శివ, కల్యాణ్, అరుణ్ ఉన్నారు.

డిజెలతో ఇబ్బందులు కలిగించొద్దు

- ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామీణ ప్రాంతాల్లో శుభ కార్యాలయాలు జరిగే నేపథ్యంలో డిజెలు పెట్టి భయంకరమైన శబ్దాలతో ప్రజలను విసిగిస్తున్నారని, ఇది మానుకోవాలని ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాహాలు జరుగుతున్నప్పుడు వధూవరుల ఊరేగింపు రాత్రి 10 గంటల్లోపు పూర్తి చేయాలన్నారు. రాత్రి 10 దాటినా, ఎక్కువగా డిజె శబ్దాలు వచ్చినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలు చేసే వారు కూడా ముందుగా పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చి మీసేవా కేంద్రాల్లో చలానా కట్టి రసీదు పొందాలన్నారు.

ఎస్ఐకి ప్రజాప్రతినిధుల సన్మానం

సాధారణ బదిలీల్లో భాగంగా చిప్పగిరి పోలీసు స్టేషన్‌కు వచ్చిన నూతన ఎస్ఐ ఎపి.శ్రీనివాసులును చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, కుందనగుర్తి సర్పంచి కొండా పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. హేమాంజనేయులు, శ్రీనివాసులు, రామాంజనేయులు, రాముడు పాల్గొన్నారు.



ఎస్ఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న సర్పంచి గోవిందరాజులు, సర్పంచి కొండా పురుషోత్తం

ఆటపాటలతో అలరిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆటపాటలతో చిన్నారులు అలరిస్తూ పుస్తకాలు చదువుతున్నారని గ్రంథాలయ అధికారి కె.విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో చిన్నారులకు గ్రంథాలయాలు, వాటి ప్రాముఖ్యత తెలుపుతూ విద్యార్థుల చేత కథలు చెప్పించడం, పుస్తక పఠనం చేయించడం, విద్యార్థులచే పద్యాలు చెప్పిస్తూ ఆట పాటలతో పాటు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో ఈ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జూన్ 6 వరకు ఉంటుందని, విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. **కౌతాళం :** చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో మేధో శక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారిని మధు లీల పేర్కొన్నారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి, విద్య పట్ల ఆసక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఆలూరులో చదువుతున్న చిన్నారులు

కౌతాళం

బీసీ మహిళల పేరుతో భారీ దోపిడీకి కుట్ర

- తొలి విడతలో రూ.157 కోట్ల స్వాహాకు యత్నం

- వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బీసీ మహిళల పేరుతో కూటమి నేతలు రూ.254 కోట్ల దోపిడీకి కుట్ర పన్నారని వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు టి.మురళీ నాయుడు, జిల్లా చేనేత అధ్యక్షులు ఎంకె.శివ ప్రసాద్ మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు వృత్తి నైపుణ్యాలను అందించే కార్యక్రమాలను కూడా అవినీతి కల్పతరువుగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మండిపడ్డారు. బీసీ, ఒబీసీ, కాపు మహిళలకు కుట్టుశిక్షణ, మిషన్ల పంపిణీలో తొలి విడతలో రూ.157 కోట్లు దోచుకునేందుకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ శిక్షణ సంస్థలను కాదని, కూటమి నేతలకు అనుకూలమైన వ్యక్తులకు టెండర్లను కట్టబెట్టారని విమర్శించారు. కుట్టుమిషన్, శిక్షణకు కలిపి ఒక్కో మహిళకు సుమారు రూ.7,300 అవుతుందని, కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.23 వేల అవుతుందని అంచనా వేసిందని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్, నందవరం మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్, పట్టణ కార్యదర్శి జెరుబండి రఘువీరా, 33వ వార్డు నాయకులు వడ్డే వీరేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి రెడ్డి

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION): ADONI

O.S.NO.278/2017

Between:
Jampapuram Ananathasena Reddy - Plaintiff
V/s.
Chudi Vasantha Reddy died by LRs and others. - Defendants.

TO:

D-5: Smt. Chudi Maheswari W/o. Late.Chudi Mallikarjuna Reddy, Ward No.1 Near Apajapa Matam, Jampapuram village, Kosigi Mandal, Kurnool District.

D-6. Mr. Chudi Chaithanya Reddy S/o. Late.Chudi Mallikarjuna Reddy, minor, represented by Guardian/mother Smt. Chudi Maheswari W/O. Late.Chudi Mallikarjuna Reddy, Ward No.1 Near Apajapa Matam, Jampapuram village, Kosigi Mandal, Kurnool District.

Whereas the above named the Plaintiff filed the above suit against the Defendants for Specific performance of agreement of sale direct the Defendants No.1 to 4 to execute a registered Sale Deed in favour of the plaintiff in respect of Plaint Schedule property in terms Sale Agreement dated 28-03-1997 at the expenses of the plaintiff. You are hereby directed to appear before this Honorable court on19-06-2025 either in person or your Advocate and file written statement if any, failing which the matter will be decided in your absence and you will be set ex-parte.

HEARING DATE : 19-6-2025

SHRI. Y.R. MALLIKARJUNA
ADVOCATE FOR PLAINTIFF.
ADONI-518301.